క్లుప్తంగా

21నుంచి వాలీబాల్ పోటీలు

శాయంపేట : మండల కేంద్రంలో ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు గాజుల మొగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కందగట్ల సమ్మయ్య స్మారకార్థం సర్పంచ్ రవి సహకారంతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9848723771, 7731910824, 9550541445 ఫోన్ నంబర్లను సంప్రదించి రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి టీం పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి బహుమతి రూ. 5వేలు, రెండో బహుమతి రూ.3వేలు అందించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ వర్ధంతి



కమలాపూర్ : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని మండల కేంద్రంలో ఆపార్టీ నాయకులు గురువారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పెరుమాండ్ల రాములుగౌడ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. నాయకులు బండి కిశోర్, కుమార్, సాగర్‌బాబు, సమ్మయ్య, శంకర్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

31 వరకు తుది గడువు

సంగెం : రేషన్ డీలర్ల వద్ద ఈ–కేవైసీ చేయించుకునేందుకు ఈనెల 31 వరకు మాత్రమే గడువు ఉందని తహసీల్దార్ రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డులో పేరున్న ప్రతీఒక్కరూ గడువులోగా ఈ–కేవైసీ చేసుకోవాలని పేర్కొన్నారు. లేని పక్షంలో రేషన్ నిలిచిపోతుందని,ప్రభుత్వ పథకాలు పొందేందుకు అనర్హులుగా ప్రకటించబడతారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందన

వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రకటించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్‌లను అసెంబ్లీ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు గురువారం కలిసి అభినందించారు. తొలుత వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు వైద్యపరీక్షలు



వర్ధన్నపేట : పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన సదరం క్యాంప్‌లో 95 మంది దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 99 మంది స్లాట్ బుక్ చేసుకోగా శిబిరానికి 95 మంది హాజరై పరీక్షకు హాజరయ్యారు. అర్హులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) నుంచి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పెన్షన్ విభాగ అధికారులు మీడియాకు వెల్లడించారు. క్యాంప్‌లో వైద్యాధికారులు డాక్టర్ చందునాయక్, ఫిజియోథెరపిస్టు నర్సింహారెడ్డి, వేణు, సైకాలజిస్టు వీరయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి, డాక్టర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ హర్షణీయం

హన్మకొండ: ప్రపంచ జ్ఞాని, భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో స్థాపించి, ఈనెల 19న ఆ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించబోతుండడం హర్షణీయమని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ కొనియాడారు. 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సామాజిక న్యాయ మహా సంకల్పం పేరుతో జాతికి అంకితం చేస్తుండడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశానికి విగ్రహం ఆదర్శంగా నిలిచిందని, ఇది చారిత్రాత్మకమైన నిర్ణయమని పేర్కొన్నారు. అంబేడ్కర్ బాటలో అడుగిడుతున్న ఏపీ సీఎం జగన్‌కు దళితుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

పట్టాభిషేక పోస్టర్ల విడుదల

వరంగల్ చౌరస్తా: సీతారామచంద్ర కల్యాణం పట్టాభిషేకానికి సంబంధించిన పోస్టర్లను వరంగల్ చౌరస్తాలోని గీతా మందిర్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ నిర్వాహకులు సీఏ త్రిపురనేని గోపిచంద్, బండారు సాయి నారాయణ, మాదాపూర్ సదాశివుడు మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతిఒక్కరూ రామనామ స్మరణ చేయాలని సూచించారు.

నిధులను సక్రమంగా వినియోగించాలి



శాయంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి



ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎంపీపీ మార్క సుమలత

శాయంపేట : మండలానికి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించాలని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన 15వ ఆర్థిక సంఘం నిధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తిరుపతిరెడ్డి మాట్లాడారు. 15ఫైనాన్స్ నిధులు రూ. 28,61,209 మంజూరు అయినట్లు తెలిపారు. వీటిలో 30శాతం తాగునీటి, 30శాతం పారిశుధ్య పనులకు, 10శాతం కార్యాలయ నిర్వహణ, 30శాతం ఇతర పనులకు వినియోగించుకోవచ్చని అన్నారు. వారం రోజుల్లో ఈ నిధుల వినియోగం కోసం తీర్మానం చేయాల్సి ఉందన్నారు. వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు వావిలాల వేణుగోపాలప్రసాద్, ఐలయ్య, మేకల శ్రీనివాస్, దైనంపల్లి జమునసుమన్, గొట్టిముక్కల స్వాతివిష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ గంగాజమున, ఏపీఓ కీర్తి అనిత, ఎస్బీడీసీఎల్ ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : గ్రామాల్లో అభివృద్ధి పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ మార్క సుమలతరజనీకర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 15వ ఆర్థికసంఘం పనులపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ సుమలత మాట్లాడుతూ.. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పనులను సక్రమంగా చేపట్టాలని అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నాయకత్వంలో మండలాన్ని మరింత అభివృద్ధి చేయాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తూ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, నాయకులు

ఐనవోలు : మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు గురువారం ఆవిష్కరించారు. టీపీటీఎఫ్, టీపీయూఎస్ సంఘాల నాయకులతో కలిసి వేర్వేరుగా ఆవిష్కరించారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సీఎస్ఆర్ మల్లిక్, సీహెచ్ లింగారావు, రవీందర్, బ్రహ్మాచారి, విజయ్‌భాస్కర్ రెడ్డి, బీఎస్‌చార్యులు, రాము, పద్మలత, సురేఖ, స్వాతి, సుమలత, సీఆర్పీ రాజ్‌కుమార్, భావన, రేవతి, టీపీయూఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, శేషు, రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, రామనాథం, శేఖర్, టీపీటీఎఫ్ నాయకులు సారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహర్షుడు, సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, మహేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు : ఎస్సై



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

దామెర : అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. మండలంలోని ముస్త్యాపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ సమీపం నుంచి గురువారం అనుమతులు లేకుండా కొందరు మొరం తరలిస్తున్నారు. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీతో పాటు మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని సదరు యజమానులపై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మొరం తలిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటరు నమోదులో నిర్లక్ష్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

ఖానాపురం : ఓటరు నమోదులో నిర్లక్ష్యం చేయొద్దని తహసీల్దార్ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు చేసుకునేలా అర్హులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదు దరఖాస్తులను సకాలంలో తీసుకోవాలని చెప్పారు.

రాముడి అక్షింతలతో శోభాయాత్ర

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రానికి చేరిన అయోధ్య రాముడి అక్షింతలకు అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన వోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అక్షింతలను ఆలయ ప్రాంగణంలో ఉన్న 29 దేవతామూర్తుల ఎదుట ఉంచి పూజలు జరిపించారు. అనంతరం వాటిని శోభాయాత్ర నిర్వహిస్తూ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యకర్త అరుణ్‌కుమార్ రెడ్డి, ఆలయ మేనేజర్ ఎల్.రవి, పీఆర్వో మణిదీప్, ఆలయ ఇన్‌చార్జ్ గంగుల రాజిరెడ్డి, శివకుమార్, సాయితేజ, శ్రీనివాస్, సీనమ్మ, పద్మ, హరిస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



ఆర్‌జేడీని సన్మానిస్తున్న టీఎన్‌జీఓ బాధ్యులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డిని టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు బాధ్యులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమన్న, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులు లక్ష్మిప్రసాద్, టీఎస్‌జీఓ పాఠశాల విద్యాశాఖ ఫోరం అధ్యక్షుడు భరత్, కార్యదర్శి రాజేశ్వర్, సిటీ అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే కళాశాలకు నిధులు



సమావేశంలో మాట్లాడుతున్న బొట్ల నరేశ్

నర్సంపేట రూరల్ : పోరాటాల ఫలితంగానే ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు కేటాయించాలని కోరుతూ పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినట్లు, నిరసనలు తెలిపినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. నిధులు మంజూరీకి కృషి చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్, తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి మొదటి ప్రాధాన్యత ఇవాలని ఈ సందర్భంగా వారు కోరారు. రానున్న రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై మరింత నమ్మకం కలిగించేలా కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చిన వారి పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

మహిళలకు రక్షణగా 'సఖి' కేంద్రం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్, తదితరులు

గీసుకొండ : ఇబ్బందుల్లో ఉన్న మహిళలకు సఖి కేంద్రం ద్వారా సాంత్వన లభిస్తుందని కౌన్సిలర్ సుధ తెలిపారు. మండలంలోని ఊకల్, ఎలుకుర్తి గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అవగాహన కల్పించారు. మహిళా రక్షణ చట్టాలు, నిర్భయ, గృహ హింస, తదితర విషయాలపై వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు హెల్ప్‌లైన్ నంబర్ 181, 0870–3571832 నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే సాయం అందిస్తామని చెప్పారు. అనంతరం హెల్ప్‌లైన్, సఖి కేంద్రం సేవలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీవోఏలు జయలత, పద్మ, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ చేస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

పర్వతగిరి : స్థానిక కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీ కోసం త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్వ్యూ నిర్వహించారు. త్రీమెన్ కమిటీగా తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, ఎంఈఓ సత్యనారాయణ అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 17 దరఖాస్తులు రాగా 12 మంది హాజరయ్యారు. దరఖాస్తుదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, వంట చేసిన ఆహార పదార్థాల డెమోను త్రీ మెన్ కమిటీ సభ్యులు ప్రత్యక్షంగా పరిశీలించారు. స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్కజీ జంక్షన్‌లో బారికేడ్లు

● ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శలు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జంక్షన్‌కు సమీపంలోనే మర్కజీ స్కూల్‌తో పాటు ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, లష్కర్‌బజార్ బాలికల ఉన్నత పాఠశాల, ఫైన్ స్కూల్, మిషనరీ సంస్థలకు చెందిన మరో రెండు పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు, వాహనదారులతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ జంక్షన్ రద్దీగా ఉంటోంది. కొత్తూరు నుంచి లష్కర్ బజార్‌కు వెళ్లే దారిలో డివైడర్‌ను సంక్రాంతి సెలవుల్లో మూసివేశారు. సెలవుల అనంతరం గురువారం డివైడర్‌ను తొలగించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గతంలో కూడా డివైడర్‌ను మూసివేయడంపై పోలీస్ కమిషనర్ దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకెళ్లగా డివైడర్లను తొలగించారు. మళ్లీ తాజాగా డివైడర్లను ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మర్కజీ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాలు



మాట్లాడుతున్న శేషాంజన్‌స్వామి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

● మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 100 శాతం పన్నులు వసూలు చేయాలని, అందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం పన్నుల వసూళ్లపై మున్సిపల్ అధికారులకు, ఉద్యోగులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని అన్నారు. పట్టణంలో పన్నులు పెండింగ్‌లో ఉండడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నందని, ఆస్తి, ఇతర పన్నుల వసూలు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వందశాతం పన్నుల వసూల కోసం సబంధిత అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ హెల్త్ అధికారి మదన్‌మోహన్, టెక్నికల్ అధికారిణి గౌతమి , టీపీఓ రాజు, టీపీఎస్ఓ ఖురేషి, సానిటేషన్ అధికారి వెంకట్‌రెడ్డి, వార్డు అధికారులు, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

'టాలెంట్'ను వెలికితీసేందుకే చెకుముకి పోటీలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ధర్మప్రకాశ్

ధర్మసాగర్ : విద్యార్థుల్లో దాగివున్న టాలెంట్‌ను వెలికితీసేందుకే చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధర్మప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు గురువారం జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టుకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి పరీక్షలకు హాజరైతేనే పోటీ పరీక్షలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. ఈనెల 22వ తేదీన పాఠశాల స్థాయి పరీక్షలు ఉంటాయని, మండలంలోని అన్ని పాఠశాలల నిర్వాహకులు 9989732423 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి ప్రశ్నపత్రాలు పొందవచ్చునని కన్వీనర్ సురేష్ తెలిపారు. ఈనెల 27వ తేదీన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముఖి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, పద్మజ, రాజమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

మదార్‌షావలీ దర్గా ఉర్సుకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ కాంతులతో మదార్‌షావలీ దర్గా

నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లి నల్లమాటువాగు ఒడ్డున గల హజ్రత్ సయ్యద్ మదార్ షావలీ దర్గా ఉర్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా ముతవల్లి మహ్మద్ ఖాజఖాద్రి తెలిపారు. నేడు గంధం తీసుకురావడం, 20వ తేదీన ఉర్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా ఎనిమిది దశాబ్దాల నుంచి ఉర్సు జరుగుతుందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మొదలుకొని హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి సుమారు 30వేల మంది భక్తులు ఉర్సుకు హాజరు కానున్నట్లు తెలిపారు. గురువారం సాయత్రం పరకాల జామ మస్జిద్ నుంచి కవ్వాలి, షాషాబ్‌ల విన్యాసాలతో గంధం తీసుకువచ్చే కార్యక్రమంతో ఉర్సు ప్రారంభం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హమ్మద్ ముస్తాఫ, ఖాజ, తదితరులు పాల్గొన్నారు.

సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు



దివ్యాంగులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాలు

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించిన సంక్రాంతి జాతర సక్సెస్ అయిందని, సహకరించిన అన్ని శాఖల అధికారులకు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు గురువారం కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికుల సహకారంతో ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా మారాయన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలు పాటించినట్లు చెప్పారు. మంత్రి ఆదేశాల మేరకు వృద్ధులకు బాలింతలకు, గర్భిణులకు, దివ్యాంగులను బస్టాండ్ నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఆలయం వద్దకు చేర్చడం జరిగిందన్నారు. కాగా జాతర సక్సెస్‌కు నిరంతరం కృషి చేసిన కార్యనిర్వహణ అధికారి నాగేశ్వర్‌రావును ఎండోమెంట్ కమిషనర్ ఆర్‌జేసీ, డీసీ అభినందనలు తెలియజేశారు.

సేవ చేయడమే వాసవి సంస్థ లక్ష్యం

● అధ్యక్షుడు పందిరి శ్రీనివాస్



మాట్లాడుతున్న అధ్యక్షుడు పందిరి శ్రీనివాస్

దామెర : జన్మ భూమికి సేవ చేయడమే ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ సంస్థ లక్ష్యమని ఆసంస్థ అధ్యక్షుడు పందిరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ల్యాదెల్లలో గురువారం ఎన్ఆర్ఐ వాసవి, రెడ్‌క్రాస్, బన్ను ఆరోగ్య సేవ సొసైటీసంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించి 400 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రెడ్ క్రాస్ చైర్మన్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బెంచీలు, గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలు, ల్యాప్‌టాప్, 200 మంది విద్యార్థులకు డెంటల్ కిట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. అమెరికాలో స్థిరపడి వివిధ హోదాల్లో ఉన్న తాము దేశానికి తన వంతుగా సేవ చేయాలని ఉద్దేశంతో సంస్థను నెలకొల్పినట్లు తెలిపారు. సంస్థ తరుపున సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రాణాంతక క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందనే ఉద్దేశంతో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తు స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను అనుగుణంగా కష్టపడి చదువుకోవాలని సూచించారు. సంస్థ తరుపున అందిస్తున్న మౌలిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో మండల వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ అనంతరం విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామంలో సేవ కార్యక్రమాలు చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు రజిని, డాక్టర్ నిఖిల్, బన్ను జనరల్ మేనేజర్ వాడికారి రాజేందర్, సర్పంచ్ శ్రావణ్య, ఉపసర్పంచ్ కీర్తి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.